# ప్రీతి సల్లాపం

ఒక జాతి ఔన్నత్యం వేల సంవత్సరాలు చిరస్థాయిగా నిలబడి, తరతరాలు దాన్ని స్మరించుకుంటుందంటే, తన ఔన్నత్యాన్ని ఉన్నతీకరించటానికి ఆ జాతి నిరంతరం చేసిన కృషే అందుకు కారణం. సమూహాలు, వ్యక్తులు దేశాంతరాలు వెళ్లవచ్చు... వారి మధ్య కాలాంతరాలు గడిచిపోవచ్చు. కానీ, వారి అస్తిత్వ మూలాలు మాత్రం నీడలా వెన్నంటి ఉంటాయి. అమ్మకు దూరంగా అల్లంత దూరాన ఉన్నా, తల్లీ కొడుకుల మధ్య ప్రేమ ఎంత దృఢంగా పెనవేసుకుని ఉంటుందో... తాము ఎంత దూరంగా ఉంటున్నా, మాతృభూమిపై అనురాగాన్ని ఎంతగా పెనవేసుకుని ఉంటారో అనడానికి ప్రవాసాంధ్రులు నిరంతరంగా సాగిస్తున్న భాషా, సాహిత్య, సాంస్కృతిక సేవలు ప్రబల నిదర్శనాలు. ప్రపంచానికి మన జాతి అందించిన అనేకానేక విషయాలను విశ్వవ్యాప్తం చేయడంలో వారి తాపత్రయం ఎన్నదగింది. అందుకు నిదర్శనం ఇదిగో మీ ముందున్న ఈ సంకలనం.

ఈ సంకలనంలోని ప్రధాన అంశం 'ప్రేమ'. ఇది మనం సినిమాల్లో ప్రేయసీ ప్రియుల మధ్య చూసే ప్రేమ అనబడే ఆకర్షణ కాదు... సినిమాల్లోని విచిత్ర, విచ్ఛిన్న ప్రేమ అంతకంటే కాదు.. ఈ ప్రేమ విశ్వమయమైనది. ప్రేమకు ఆదిమూలమైన ప్రకృతి పురుషుల సాక్షిగా సృష్టిలో సమస్త జీవజాలం మధ్య కనిపించే వాత్సల్యం ఈ ప్రేమ. ప్రేమకు నిర్వచనం ఇది అని చెప్పడం సామాన్యుడికి సాధ్యమయ్యే పని కాదు. అది అక్షరాలకు అందని అనుభవం. భూమికి, ఆకాశానికిమధ్య విశ్వమంతటా వ్యాపించి ఉన్న ఆద్యంతాలు లేని భావనకు పేరు ప్రేమ. భక్తి, వాత్సల్యం, అనురాగం, అప్యాయత, దయ, అభిమానం ఇత్యాదులన్నీ కూడా ప్రేమకు రూపాంతరాలే. ఇందులో ఆర్ద్రత నిండి ఉంటుంది. ఇది ఒక్కొక్కరికి ఒక్కోరకంగా అనుభవంలోకి వస్తుంది. ఒక్కొక్కరి మధ్య విశిష్టమైన రీతిలో చిగురిస్తుంది. ప్రేమ ఎంత మధురం అన్నాడు ఓ కవి. నిజంగా ప్రేమ మధురమైంది! అవ్యాజమైంది. తన పుట్టుకకు కారణమైన తల్లితో, తనను ఉద్ధరించిన తండ్రితో సంతానానికి ఉండే ప్రేమ అనురాగ బద్ధమైంది. అయితే సృష్టిని కొనసాగించే పరిణామ క్రమంలో భార్యాభర్తల మధ్య చిగురించే ప్రేమ అన్నింటికన్నా ఉత్కృష్టమైనది. ప్రకృతి పురుషుల పవిత్ర ప్రణయానికి ఇహలోకంలో భార్యాభర్తలు ప్రతీకలు. భగవంతుడికి, భక్తులకు మధ్య ఉండే అవినాభావ సంబంధమూ ప్రేమే. దానికి కొలమానం లేదు. హద్దులు అంతకంటే లేవు... అది అనంతమైనది. అపూర్వమైనది. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రేమ నిత్య చైతన్య శీల.

ఈ చైతన్యానికి మూర్తిమంతమైన రూపం బృందావనమాలి అయిన శ్రీకృష్ణుడు. దేవకీ యశోదలకు పుత్ర వాత్సల్యాన్ని, బలభద్ర, సుభద్రలకు సోదర వాత్సల్యాన్ని, రుక్మిణీ సహిత అష్ట భార్యలకు భర్తృప్రేమను, గోపికారమణులకు ఈశ్వర చైతన్యాన్ని, రేపల్లెకు, ద్వారకకు సామరస్యాన్ని అందించిన ప్రేమ స్వరూపుడు శ్రీకృష్ణపరమాత్ముడు.

బృందావనంలో గోపికలు శ్రీకృష్ణుడి పట్ల ప్రేమ వివశులై ఉన్నారట. ఆ ప్రేమ ఏ స్థాయికి చేరుకుందంటే వారి శ్వాస ప్రాణాలు శ్రీకృష్ణుడే అయిపోయాడు. ఆయన కోసం వారి శారీరక క్రియలన్నింటినీ వదులుకున్నా కూడా. సామాన్యమైన లోక ధర్మాలను సైతం త్యజించారట. లోకనిందనుంచి తప్పించుకోవటానికి తిరిగి తమ సంసారాలను

Telugu Jyothi Special Issue April 2008

చక్కదిద్దుకోవటానికి గోపికలు శ్రీకృష్ణుని మరచిపోవాలని ప్రయత్నిస్తున్నారట. ఈ విషయం తెలుసుకుని నారద మహర్షి ఒకనాడు వారి దగ్గరకు వెళ్లాడట. అక్కడ ఒక గోపిక ప్రాణాయామం చేస్తున్నది. మరొక గోపిక ఆసనాలు వేస్తోంది. ఇంకో గోపిక శీర్షాసనం వేసింది. వేరొక గోపిక ధ్యానం చేస్తున్నది. వీరందరినీ చూసి విస్తుపోయిన నారదుడు వారిని సమీపించి "మీరు ఏమిటి చేస్తున్నారు? శ్రీకృష్ణ భగవానుని మీ హృదయంలో స్థిరంగా పదిల పరచుకోవాలని ఈ యోగం ప్రారంభించారా?" అని అడిగాడట. అప్పుడు ఓ గోపిక "ఓ మహర్షీ! ఆ పేరెత్తవద్దు.. ఆ పేరెత్తితే మా సాధన భగ్నమైపోతుంది. ఆ పేరుగలవాణ్ణి మా హృదయంలో నుంచి బైటికి వెళ్ల గొట్టడానికే మేము ఇదంతా చేస్తున్నాం అన్నదిట. ఆ గోపికలు శ్రీకృష్ణుని యందే తమ సంకల్పాలు, వికల్పాలు నిలుపుకున్నవారు కాబట్టే ఇంత వ్యథ చెందాల్సి వచ్చింది. ఆయన్ను ఎంత గాఢంగా తమ మనసుల్లో స్థాపించుకున్నారో కదా అని నారదుడు ఆశ్చర్యపోయాడట. అలాంటి కృష్ణుడికి హ్లాదినీ శక్తి, మూల ప్రకృతి రాధికగా అవతరించింది. ఆమె బృందావన పట్టమహిషి. గోపికలంతా ఆమె కాయవ్యూహంలోని వారయ్యారు. వారిది పరిశుద్ధమైన ప్రేమ. సంపూర్ణమైన త్యాగ శక్తి వారి ప్రేమకు ఉంది. అలాంటి ప్రేమే కామాన్ని నాశనం చేస్తుంది. తమ మనస్సును, తనువును, లోక, పరలోక సుఖాలన్నింటినీ త్యాగం చేస్తారు. ఉజ్జ్వల రసవైచిత్రికి బృందావనం ఆధారభూతం.

ఇంత ఉదాత్తమైన ప్రేమ భావనకు జగద్గురువైన శ్రీకృష్ణుడి రాసలీలలను భాగవతం ద్వారా అందించిన తెలుగుల పుణ్యపేటి మహాకవి బమ్మెర పోతనకు ఏమిచ్చి ఋణం తీర్చు కోగలం?

ఒక కొమ్మకు పూసిన పువ్వుల మధ్య అనురాగం ఎలా ఉంటుందో, ఒక కడుపులో పుట్టిన వారి మధ్య ప్రేమ అలాగే విరబూస్తుంది. అదే సౌభ్రాత్రం. ఈ సౌభ్రాత్ర భావన కుటుంబం నుంచి సమాజం పైనా, సమాజం నుంచి తన ఊరి పైనా, తన జాతిపైనా, తన భాషపైనా, తన దేశం పైన ప్రేమ కలిగిస్తుంది. మానవ సమాజంలో సామరస్యాన్ని, సమతూకాన్ని కలిగించేది ప్రేమ. సామరస్యం అంటే సమ రసం. అంటే ఒకే రకమైన అనుభవం. ఇద్దరి మధ్య ఒకే రకంగా చిగురించే అనుభవం పేరే ప్రేమ. ఈ ప్రేమ ఉన్న చోట ఎంతటి గాయానికైనా చోటుండదు. అలాంటి ప్రేమను విషయంగా తీసుకుని ప్రవాసాంధ్రులు అపురూపమైన సంకలనానికి పూనుకోవటం విశేషం. ఈ సంకలనంలో విశ్వంలో మనకు కనిపించే అన్ని రకాల ప్రేమ భావనలను ఉదాత్తంగా ప్రతిబింబించే ప్రయత్నం ప్రతి వ్యాసంలోనూ, శీర్షికలోనూ, కవితలోనూ, కథలోనూ కనిపించింది. ప్రతి ఒక్కదాన్నీ కొలమానం వేసి చూడలేమేమో కానీ, ప్రతి ఒక్కటీ ఇందులో ఎన్నదగినదేనని చెప్పవచ్చు. ప్రామాణికంగా హెచ్చుతగ్గులుండవచ్చేమో కానీ, ప్రేమైక భావనను మనసు విప్పి చెప్పటంలో మాత్రం ప్రయత్న లోపం లేదు. ప్రవాసాంధ్రులు నిండైన ప్రేమను ప్రత్యక్షరంలో నింపి మీ ముందుంచుతున్న సంకలనం ఇది. ప్రేమగా ఇస్తున్న ఈ చిరు పొత్తాన్ని... ప్రేమతో స్వీకరించండి.

**-కోవెల సంతోష్‌కుమార్**



Telugu Jyothi Special Issue April 2008